సాక్షి
కామారెడ్డి
సోమవారం । 5 । ఫిబ్రవరి । 2024



విజయం మీదే..
పరీక్షలంటే భయాన్ని వీడి, ఇష్టంతో చదివితే విజయం సాధించడం సులువని నిపుణులు సూచిస్తున్నారు.
- 8లో ▸



జహీరాబాద్ స్థానంపై..
జహీరాబాద్ ఎంపీ స్థానాన్ని గెలుచుకునేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సూచించారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
33.5 /16.1

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గురుకులాల ఇంటర్ ప్రవేశ పరీక్ష



కామారెడ్డి క్రైం: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం ఆదివారం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించారు. ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. సదాశివనగర్ మండలంలోని మర్కల్ గురుకులంలో పరీక్షల నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 9 కేంద్రాలలో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రవేశ పరీక్షలు రాశారని పేర్కొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువ ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు గేట్ల ద్వారా ప్రధాన కాలువకు 1,505 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రధాన కాలువ ద్వారా ప్రవహిస్తున్న సాగర్ నీటిని ఆయకట్టు ప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాజెక్టు అధికారులు సూచించారు.

నేడు 25వ నంబర్ గదిలో ప్రజావాణి

కామారెడ్డి క్రైం : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణిని సమావేశ మందిరంలో కాకుండా 25వ నంబర్ గదిలోకి మార్చినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి యథావిధిగా సమావేశ మందిరంలోనే ప్రజావాణి ఉంటుందన్నారు. ఈ మార్పును గమనించాలని ప్రజలకు సూచించారు.

బొమ్మ తుపాకీతో పోకిరీల బెదిరింపులు

ఖలీల్‌వాడి: నగరంలో కొందరు పోకిరీలు తమ చేష్టలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. శనివారం రాత్రి ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ముగ్గురు విద్యార్థులు కేంద్రీయ విద్యాలయం సమీపంలో చీకట్లో బొమ్మ తుపాకీతో శబ్దం చేస్తూ హల్‌చల్ చేశారు. వీరి ప్రవర్తనతో మినీ ట్యాంక్ బండ్‌కు వచ్చిన మహిళలు, యువతులు ఇబ్బందులు పడ్డారు. బొమ్మ తుపాకీ శబ్దాన్ని గుర్తించిన మహిళా హోంగార్డు స్థానికుల సహాయంతో ముగ్గురిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఐదు నెలల క్రితం ఒకటో టౌన్ పరిధిలోని ఖలీల్‌వాడిలో దంపతులు బైక్‌పై వెళ్తుండగా వెనుక బైక్ నుంచి వస్తున్న ముగ్గురు ఆకతాయిలు బొమ్మ తుపాకీతో బెదిరింపులకు పాల్పడ్డారు. ఇలా నగరంలో అడపాదడపా ఘటనలు జరుగుతుండడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆకతాయిలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'మహాలక్ష్మి'తో అదనపు ఆదాయం



నిజాంసాగర్ : మహాలక్ష్మి పథకం అమలుతో ఆర్టీసీకి ఆదాయం పెరిగిందని బాన్సువాడ డిపో మేనేజర్ సరితాదేవి పేర్కొన్నారు. బాన్సువాడ డిపో పరిధిలో నిత్యం రూ. 5 లక్షల అదనపు ఆదాయం వస్తోందన్నారు. ఆదివారం నిజాంసాగర్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాన్సువాడ డిపో పరిధిలో 85 బస్సు సర్వీసుల్లో నిత్యం 30 వేల మంది ప్రయాణం చేసేవారన్నారు. మహాలక్ష్మి పథకం అమలుతో ప్రయాణికుల సంఖ్య పెరిగిందని, నిత్యం 43 వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నామని పేర్కొన్నారు. డిపోకు కొత్తగా ఏడు బస్సులు వచ్చాయని ప్రస్తుతం వాటిని సమ్మక్క సారక్క జాతర స్పెషల్‌గా నడుపుతున్నామని తెలిపారు.

నేడు ఎమ్మెల్యే, కలెక్టర్ రాక
నిజాంసాగర్ బస్టాండ్ ఆవరణలో సోమవారం మరుగుదొడ్ల నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు డీఎం తెలిపారు. కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొంటారన్నారు.

నంబర్ ప్లేట్‌పై నజర్

- జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేస్తున్న పోలీసులు
- నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలకు జరిమానాలు

ట్రాఫిక్ రూల్స్‌ను పక్కాగా అమలు చేయడానికి పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపడుతూ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడుపుతున్నవారికి జరిమానాలు విధిస్తున్నారు. ప్రధానంగా నంబర్ ప్లేట్‌లపై దృష్టి సారించిన పోలీసులు.. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నవాటిని తొలగించి కొత్తవి వేయిస్తున్నారు. ప్రతి వాహనదారు నిబంధనల ప్రకారం నంబర్ ప్లేట్ ఉంచాలని సూచిస్తున్నారు.



కామారెడ్డి క్రైం : నేరాల నియంత్రణలో తలనొప్పిగా మారుతున్న అంశాలపై పోలీసులు దృష్టి సారించారు. వ్యవస్థాపరంగా ఉన్న లోపాలను సరిచేస్తే నేరాలను నియంత్రించడం తేలికవుతుందని భావిస్తున్నారు. చాలామంది వాహనదారులు జరిమానాలను తప్పించుకునేందుకు నంబర్ ప్లేట్ సరిగా లేకుండా తిరుగుతున్నారు. అలాగే నంబర్ ప్లేట్ లేని వాహనాలను ఉపయోగిస్తూ కొందరు నేరస్తులు తప్పించుకుని తిరుగుతున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. నేర పరిశోధనలో ఇది ఆటంకాన్ని కలిగించే అంశం. దీంతో మోటారు వాహనాల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహనాల తనిఖీలను పెంచారు. ప్రధానంగా నంబర్ ప్లేట్ లేని వాహనాలను గుర్తించే పనిలో పడ్డారు. జనవరి నుంచి జిల్లాలో వాహనాల తనిఖీలు పెరిగాయి. ఆయా సబ్ డివిజన్లకు సంబంధించిన డీఎస్పీలు, సీఐలు సహా పోలీసులంతా తనిఖీలపైనే ఎక్కువ దృష్టి సారించారు. ప్రధాన కూడళ్లు, చౌరస్తాలలో విస్తృతంగా వాహనాలను పరిశీలిస్తున్నారు. ఒక్క దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోనే నెల వ్యవధిలో నంబర్ ప్లేట్ పూర్తిగా లేదా పాక్షికంగా లేని 150 బైక్‌లను గుర్తించి ఠాణాకు తరలించారు. ప్రతి వాహన యజమానితో మాట్లాడి కొత్త నంబర్ ప్లేట్ వేయించాకే వాహనాన్ని అప్పగించారు. ఇలా జిల్లావ్యాప్తంగా నంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోంది.

నిబంధనలు పాటించాల్సిందే..

మోటారు వాహనాల చట్టం ప్రకారం ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, లైసెన్స్‌లు కలిగి ఉండాలి. నంబర్ ప్లేట్ నిబంధనల ప్రకారం ఉండాలి. బైక్ నడిపేవారు హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు ధరించాలి. ఈ నిబంధనలను పక్కాగా అమలు చేయడానికి పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. లేదంటే చర్యలు తప్పవంటున్నారు. భారీ శబ్దాలు చేసేలా సైలెన్సర్లలో మార్పులు చేయించి తిరిగేవారు చాలామంది ఉన్నారు. వాహనాలనుంచి వచ్చే భారీ శబ్దాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో పోలీసులు అలాంటి వాహనాలపైనా దృష్టి సారించారు. రెండు రోజుల క్రితం కామారెడ్డి పట్టణ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టి 26 బైక్‌లను ఠాణాకు తరలించారు. సైలెన్సర్‌లను తొలగించి పంచనామా చేసి రోడ్ రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. అంతే కాకుండా నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు జరుగుతున్నాయి. వాహనదారులు నిబంధనలు పాటించకుండా తిరిగితే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

చర్యలు తప్పవు



నెలరోజులుగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నాం. నంబర్ ప్లేట్ లేని వాహనాలను గుర్తించి జరిమానాలు వేస్తున్నాం. నెల రోజుల్లో మా పీఎస్ పరిధిలోనే నంబర్ ప్లేట్ లేని సుమారు 150 వాహనాలను గుర్తించి, వాహనాల యజమానులతో మాట్లాడాం. కొత్త నంబర్‌ప్లేట్ వేయించి పంపించాం. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి. లేకపోతే చర్యలు తప్పవు.
– రాజు, ఎస్సై, దేవునిపల్లి పీఎస్

పోలీసు శాఖలో బదిలీల జాతర

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాగానే కీలక శాఖల్లో అధికారుల బదిలీలు జరిగాయి. జిల్లాలోని పోలీసు శాఖలోనూ బదిలీల జాతర కనిపిస్తోంది. జిల్లాలో ఇటీవలే పలువురు సీఐలు, ఎస్సైలకు స్థానచలనం కలిగింది. మిగిలిన ఎస్సై, ఆపై స్థాయి అధికారులు సైతం బదిలీ అయ్యే అవకాశాలున్నాయి. ఈ క్రమంలో అధికారులు తమకు నచ్చిన స్థానాల కోసం నేతల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.

- పోస్టింగుల వేటలో అధికారులు
- సిఫార్సుల కోసం నేతల చెంతకు..



కామారెడ్డి క్రైం : జిల్లాలో 3 సబ్ డివిజన్‌లు, 9 సర్కిళ్లు, 23 పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయి. డీఎస్పీల నుంచి ఎస్సైల వరకు బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఇటీవల పలువురు అధికారులకు స్థానచలనం కలిగింది. జిల్లా పోలీసు కార్యాలయంలోని స్పెషల్ బ్రాంచ్‌లో సీఐగా ఉన్న సంతోష్ కుమార్ సదాశివనగర్ సర్కిల్‌కు, డీసీఆర్‌బీలో సీఐ గా ఉన్న శ్రీధర్ రెడ్డి ఆర్మూర్ రూరల్‌కు, ఎల్లారెడ్డి సీఐ శ్రీనివాస్, సదాశివనగర్ సీఐ రామన్, బిచ్కుంద సీఐ కృష్ణలు ఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ నుంచి జగడం నరేష్ బిచ్కుందకు, నిర్మల్ స్పెషల్ బ్రాంచ్ నుంచి రవీందర్ నాయక్ ఎల్లారెడ్డికి బదిలీపై వచ్చారు. వారంతా నూతన స్థానాల్లో బాధ్యతలు సైతం చేపట్టారు. మరుసటి రోజే నలుగురు ఎస్సైల బదిలీలు జరిగాయి. తాడ్వాయి ఎస్సైగా ఉన్న ఆంజనేయులు గాంధారికి బదిలీ కాగా.. తాడ్వాయి, ఎల్లారెడ్డి, లింగంపేట ఠాణాలకు బయటి జిల్లాల నుంచి ఎస్సైలను కేటాయించారు. జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న మిగతా ఎస్సైలు కూడా బదిలీ కానున్నారు. అలాగే కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డీఎస్పీలను సైతం బదిలీ చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. కామారెడ్డి డీఎస్పీ పనిచేయడానికి గతంలో పట్టణ సీఐలుగా పని చేసి పదోన్నతులు పొందిన ఇద్దరు అధికారులు గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. కామారెడ్డి రూరల్ స్థానం కోసం గతంలో సదాశివనగర్, భిక్కనూరు సీఐలుగా పనిచేసిన ఇద్దరు అధికారులతోపాటు కామారెడ్డిటౌన్, బిచ్కుంద స్టేషన్‌లలో ఎస్సైగా పనిచేసి పదోన్నతిపై పొరుగు జిల్లాకు వెళ్లిన ఓ సీఐ కూడా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. గతంలో సదాశివనగర్ ఎస్సైగా పని చేసి ఇటీవలే పదోన్నతి పొందిన ఓ అధికారి, ఎల్లారెడ్డిలో సీఐగా చేసిన మరో అధికారి భిక్కనూరు సర్కిల్‌కు రావడానికి పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. కామారెడ్డి సబ్ డివిజన్ పరిధిలోని దాదాపు అందరు ఎస్సైలు తమకు నచ్చిన పోస్టింగ్‌ల కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారని సమాచారం.

అనుకూల స్థానం కోసం..

అధికారుల బదిలీల్లో రాజకీయ నాయకుల సిఫార్సులకోసం పలువురు పోలీసు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ముందుగా నేతలను ప్రసన్నం చేసుకుంటేనే మంచి పోస్టింగులు దక్కే పరిస్థితి నెలకొనడంతో ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. జిల్లాకేంద్రంలో ఉండే అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్య నాయకుడి ద్వారా ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునేందుకు చాలామంది ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎవరి ప్రయత్నాలు ఏ మేరకు సఫలీకృతం అవుతాయి, ఎవరికి ఎక్కడ పోస్టింగ్ లభిస్తుందన్న అంశంపై పోలీసు శాఖలో చర్చ నడుస్తోంది. మరో వారం రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలి

సదాశివనగర్ : బీజేపీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి లోక్‌సభ ఎన్నికలలో పార్టీ విజయానికి కృషి చేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సూచించారు. ఆదివారం సదాశివనగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మండల కార్యవర్గం సక్రమంగా పని చేయడం లేదని, ఎన్నికల సమయంలో తప్ప మిగతా సమయంలో పార్టీకి సంబంధించిన ఎలాంటి సమాచారం ఇవ్వలేని పరిస్థితి ఉందని కార్యకర్తలు ఎమ్మెల్యేతో పేర్కొన్నారు. మండల కార్యవర్గాన్ని పూర్తిగా మార్చాలని విన్నవించారు. పనిచేసేవారికి పార్టీలో తగిన గుర్తింపు ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు.

ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమితి సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, ఎంపీటీసీ నాయని మహిపాల్ యాదవ్, తిర్మన్‌పల్లి సర్పంచ్ బాల్‌రెడ్డి, పార్టీ ఉపాధ్యక్షులు మోహన్‌రాజ్, రాంరెడ్డి, నాయకులు గాదారి నర్సారెడ్డి, మార రమేశ్‌రెడ్డి, నరేశ్ గౌడ్, నర్సారెడ్డి, జైపాల్ రెడ్డి, సంతోష్ పాటిల్, రమేష్, హోటల్ రాజు తదితరులు పాల్గొన్నారు.



సదాశివనగర్‌లో పార్టీ కార్యకర్తలతో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

ఐకేపీ వీవోఏల జిల్లా కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి అర్బన్ : ఐకేపీ వీవోఏల ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మాలోత్ శివరాం నాయర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గంగవిక్రం మారుతిచారి, ఉపాధ్యక్షులుగా సరిత రెడ్డి, భాగ్యలక్ష్మి, రాములు, సువర్ణ, మోహన్‌రావు, షఫీవుద్దీన్, పండరి, ఖండేరావు, స్వప్న, పండరి, గోపాలరావు, కార్యదర్శులుగా పద్మావతి, మధులత, హరితరెడ్డి, బాలమణి, రాధ, మారుతి, రమేష్, శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులుగా విఠల్, మహేష్, లక్ష్మీదేవి, ప్రభావతి, శిరచరణ్ ఎన్నికయ్యారు.

యువజన రామారెడ్డి

- గ్రామ జనాభాలో సగం యువతే..
- 63 యూత్‌లతో ఆదర్శంగా నిలుస్తున్న వైనం
- గ్రామంలో సేవా కార్యక్రమాల్లో ముందుంటున్న యూత్ సభ్యులు



ఆజాద్ హింద్ యువజన సంఘం సభ్యులు

రామారెడ్డి : దేశగతిని మార్చే శక్తి యువతకు ఉంటుంది.. ఏ దేశానికి అయినా యువతే బలం.. అలాంటి యువత స్మార్ట్‌ఫోన్లు, వ్యసనాలకు బానిసలు అవుతున్న నేటి తరుణంలో ఆ గ్రామంలో మాత్రం ఆదర్శంగా నిలుస్తున్నారు. రామారెడ్డి మండల కేంద్రంలో యూత్ అంతా కలిసి సంఘాలను ఏర్పాటు చేసుకొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో మొత్తం 63 యువజన సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల సభ్యులు నిరుపేదలకు అండగా నిలుస్తున్నారు. ప్రతియేటా క్రీడల పోటీలు పెడుతున్నారు. కరోనా వేళ ఎంతో మందికి చేయూత అందించారు. గ్రామంలోని యువత పెడదారి పట్టకుండా క్రీడా పోటీల నిర్వహణతో పాటు, ప్రభుత్వ ఉద్యోగులు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పీఈటీలుగా పని చేస్తున్న వారు గ్రామంలోని చిన్నారులు, యువతకు వివిధ క్రీడల్లో శిక్షణనిస్తున్నారు.

యువజన సంఘాలతో టాప్
గ్రామ జనాభాలో సగం మంది 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల లోపు వాళ్లే ఉన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం గ్రామ జనాభా 8,216 ఉండగా, ప్రస్తుతం ఈ జనాభా 14 వేల పైచిలుకు ఉంటుంది. ఈ జనాభాలో సగం వరకు యువతి యువకులే ఉంటారు. రాష్ట్రంలోనే ఏ గ్రామంలో లేనన్ని యువజన సంఘాలు రామారెడ్డి గ్రామంలో ఉన్నాయి. రిజిస్ట్రేషన్ అయిన యూత్‌లు ప్రస్తుతం గ్రామంలో 63 ఉన్నాయి. 1986లో రంగు నారా గౌడ్, మహమ్మద్ కాజా, ఈశ్వర్, రాజేశ్వర్ కలిసి మొదట ఆజాద్ హింద్ యువజన సంఘంను స్థాపించారు. సంఘం మొదటి అధ్యక్షుడిగా మహమ్మద్ ఖాజాను ఎన్నుకున్నారు. ఈ సంఘాన్ని 1986లోని రిజిస్ట్రేషన్ చేశారు. అప్పటినుంచి గ్రామంలో వివిధ క్రీడల టోర్నమెంట్లు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది ఈ సంఘం. ఆ తర్వాత గ్రామంలో అనేక యువజన సంఘాలు ఏర్పడ్డాయి. ఆయా సంఘాల సభ్యులు క్రీడల టోర్నమెంట్‌ల నిర్వహణతోపాటు, సామాజిక కార్యక్రమాలు చేపడుతూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నారు. వివేకానంద ట్రస్ట్ సభ్యులు నిరుపేదలకు చేయూత అందిస్తున్నారు. విజేత, ఫ్రెండ్స్ లాంటి యువజన సంఘాలు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

ఆత్మీయ సమ్మేళనం..

రామారెడ్డిలో 1986లో స్థాపించిన ఆజాద్ హింద్ యువజన సంఘం సభ్యులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. యువజన సంఘం స్థాపించడానికి సహకరించిన వారిని సన్మానించడంతోపాటు కొత్త కమిటీని ఎన్నుకున్నారు. భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాల గురించి చర్చించారు.

యువత ముందున్నారు



రామారెడ్డి గ్రామంలో 1986లో యువజన సంఘం స్థాపించాం. మొదటి అధ్యక్షుడిగా నేను పని చేశాను. అప్పట్లోనే ఎన్నో టోర్నమెంట్లు నిర్వహించాం. గ్రామంలో యువత ముందున్నారు. ఇప్పటికీ యువజన సంఘం సేవలందించడం గర్వకారణంగా ఉంది.
– మొహమ్మద్ ఖాజా, మొదటి అధ్యక్షుడు, ఆజాద్ హింద్ యువజన సంఘం

సన్మార్గంలో నడవాలి



యువత ఉన్నత స్థాయికి ఎదగాలంటే క్రమశిక్షణ అలవాటు చేసుకొని సన్మార్గంలో నడవాలి. గ్రామంలో అత్యధికంగా యువజన సంఘాలుండడం ఆనందంగా ఉంది. గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తాం.
– సామల రాజేశ్వర్, ఆజాద్ హింద్ యువజన సంఘం

పల్లెల్లో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

- 7వ తేదీనుంచి వారం పాటు నిర్వహణ
- డ్రగ్స్, మద్యం, గుట్కాపై అవగాహన కార్యక్రమాలు
- ప్రత్యేకాధికారులకు మొదటి టాస్క్..

సాక్షి, కామారెడ్డి: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నెల 7 నుంచి వారం రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించింది. పంచాయతీ పాలక వర్గాల పదవీకాలం ముగిసి, ప్రత్యేక అధికారుల పాలన మొదలైన తరువాత మొదటి కార్యక్రమం ఇది. గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పర్యవేక్షణలో పారిశుధ్యంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. దీంతో జిల్లాలోని 526 గ్రామ పంచాయతీల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 7 నుంచి 14 వరకు గ్రామాల్లో పారిశుధ్య సమస్యను పరిష్కరించడంతో పాటు తాగునీటికి సంబంధించి ఇబ్బందులు ఉంటే వాటిని కూడా సరిచేయాల్సి ఉంటుంది. స్పెషల్ డ్రైవ్ ను జిల్లా, డివిజన్ అధికారులు పర్యవేక్షించనున్నారు. అన్ని గ్రామాల్లో వారం రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. 15న అన్ని గ్రామాల్లో ముగింపు కార్యక్రమం నిర్వహిస్తారు.ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులను సన్మానిస్తారు. యువత దురలవాట్లకు గురికాకుండా ముఖ్యంగా డ్రగ్స్, మద్యం, గుట్కా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. జిల్లాలో చాలా ప్రాంతాల్లో మిషన్ భగీరథ నీరు సరిగా సరఫరా కావడం లేదు. స్థానికంగా బోరుబావుల ద్వారా ట్యాంకులకు నీటిని ఎక్కించి సరఫరా చేస్తున్నారు. అయితే కొన్ని చోట్ల బోర్లు కూడా ఎత్తిపోయి నీటికి సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో పారిశుధ్యంపై నిర్వహించనున్న స్పెషల్ డ్రైవ్‌లో తాగునీటి సమస్యపై ప్రజలు ఏకరువు పెట్టే అవకాశాలున్నాయి.

నిధుల సమస్య...

పంచాయతీ గల్లాపెట్టెలన్నీ ఖాళీగా ఉన్నాయి. చేసిన పనులకు బిల్లులు రాలేదని పదవీ కాలం పూర్తి అయిన సర్పంచ్‌లు ఆవేదనతో ఉన్నారు. జిల్లాలోని చాలా పంచాయతీల్లో నిధుల సమస్య నెలకొంది. ప్రభుత్వం నిధులు ఇస్తేనే పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించడంతో పాటు తాగునీటి సమస్యను పరిష్కరించడానికి అవకాశం ఉంటుంది. చేతిలో చిల్లి గవ్వ లేకుండా ప్రభుత్వం ఇచ్చిన కార్యక్రమాలను ఎలా పూర్తి చేస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. పంచాయతీల ప్రత్యేకాధికారులుగా ఇటీవలే పగ్గాలు చేపట్టిన అధికారులకు ఇది మొదటి సవాల్‌గా నిలవనుంది.

ఆర్మూర్‌లో బాలుడి కిడ్నాప్

- బస్సులో వరంగల్ తరలించేందుకు కిడ్నాపర్ యత్నం
- పట్టుకుని కమ్మర్‌పల్లి పోలీసులకు అప్పగించిన ప్రయాణికులు



కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో తల్లి పక్కన కూర్చున్న గగన్ సిద్ధార్థ్ తేజ

కమ్మర్‌పల్లి: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ బాలుడు కిడ్నాప్ అయ్యాడు. అతడిని బస్‌లో తరలిస్తుండగా ప్రయాణికులు అనుమానించి, బాలుడితోపాటు నిందితురాలిని కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం బడా భీమ్‌గల్ గ్రామంలో విద్యుత్ లైన్‌మన్‌గా పనిచేస్తున్న జిల్లపల్లి గంగారాం భార్య, పిల్లలతో కలిసి ఆదివారం ఆర్మూర్ మండలం దేగాం గ్రామానికి వెళ్లారు. సాయంత్రం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. నందిపేటలో బస్ ఎక్కి ఆర్మూర్‌లో దిగగానే భీమ్‌గల్ బస్ ఉండడంతో అందులో సీటు ఆపడం కోసం గంగారాం వెళ్లాడు. అతడి వెంట పెద్ద కుమారుడు గగన్ సిద్ధార్థ్ తేజ(7) కూడా వెళ్లాడు. కానీ రద్దీలో ఆ బాలుడు కనిపించకుండాపోయాడు. కొద్దిసేపటికి గమనించిన గంగారాం ఆయన భార్య తిరుమల బస్టాండ్ అంతా వెతికినా జాడ దొరకలేదు. ఆ బాలుడిని బోధన్ మండలం సాలూర ఎస్సీ కాలనీకి చెందిన సత్తెమ్మ అనే మహిళ కిడ్నాప్ చేసి వరంగల్ వెళ్తున్న బస్‌లో ఎక్కింది. బస్ పెర్కిట్ దాటగానే తల్లిదండ్రుల కోసం గగన్ ఏడవడంతో ప్రయాణికులు అనుమానించి ఆరా తీశారు. బాలుడు ఎవరని, ఏమవుతాడని సత్తెమ్మను నిలదీశారు. షాక్‌లో ఉన్న బాలుడు తల్లిదండ్రుల పేర్లు చెప్పలేకపోయాడు. అనంతరం మోర్తాడ్‌లో దిగుతామని చెప్పిన సత్తెమ్మ.. అక్కడ దిగకపోవడంతో అనుమానించిన ప్రయాణికులు వర్ని మండలం చింతకుంటకు చెందిన సాయివంశీ రెడ్డి, జగిత్యాల జిల్లాకు చెందిన సాయికుమార్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. బస్‌డ్రైవర్ మార్గమధ్యలో కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్‌వద్ద బస్సు ఆపాడు. బాలుడు గగన్‌తోపాటు సత్తెమ్మను పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించగా, అక్కడి పోలీసులు బాలుడి తల్లి తిరుమలతో కలిసి కమ్మర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అనంతరం వివరాలు సేకరించి గగన్‌ను తల్లి తిరుమలకు అప్పగించారు. నిందితురాలిని ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో కిడ్నాప్ కథ సుఖాంతమైంది.

క్లుప్తంగా

ముమ్మరంగా చెరుకు క్రషింగ్



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా సాగుతోంది. శనివారం నాటికి 2లక్షల53వేల 624మెట్రిక్ టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు ఆదివారం తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు వెల్లడించారు.

వెల్లుట్ల రాజరాజేశ్వర ఆలయానికి విరాళం



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్లపేట రాజరాజేశ్వరాలయానికి పట్టణానికి చెందిన వ్యాపారి ప్రకాష్ రూ. 21 వేల విరాళాన్ని అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు గణపతి, ఎల్లప్పలు ఆదివారం తెలిపారు.

బాల్యమిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన గొంగ్ల నర్సింలు ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో బాల్య మిత్రులు మృతుని కుటుంబ సభ్యులకు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.40,000 ఆర్థికసాయం అందజేశారు.కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాల్య మిత్రులు వీరేంద్రప్రసాద్, నరేందర్, సంతోష్, ప్రవీణ్, సుధాకర్ తదితరులున్నారు.

బస్టాండ్‌లో షెడ్ ఏర్పాటు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి బస్టాండ్‌లో బాన్సువాడ బస్ డిపో అధికారులు ఆదివారం షెడ్‌ను ఏర్పాటు చేశారు. బస్టాండ్ నిర్మాణంలో ఉండడంతో ఎండ తీవ్రత పెరిగిన కారణంగా ప్రయాణికుల సౌకర్యార్థం షెడ్‌ను ఏర్పాటు చేసినట్లు డీఎం సరిత తెలిపారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ సీఓఈ ప్రవేశ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించామని ప్రవేశ పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్ మీనాక్షి తెలిపారు. అదివారం మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులలో సీఓఈ ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. గురుకుల జూనియర్ సీవోఈ ప్రవేశపరీక్షకు మొత్తం 248 మంది విద్యార్థులకు గాను బాలికలు 136, బాలురు 96 మొత్తం 232 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 16 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని తెలిపారు.

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఆదివారం సీవోసీ (సెంటర్ ఫర్ ఎక్సలెన్స్) ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ప్రిన్సిపల్ కృతమూర్తి అన్నారు. ఇంటర్ అడ్మిషన్లకుగాను సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ కళాశాలలో ప్రవేశాల కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించగా 384 మందికి గాను 373 మంది విద్యార్థులు హాజరయ్యారని అన్నారు.

భయం వీడితే.. విజయం మీదే..

- ఈ నెల 28 నుంచి ఇంటర్, మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు
- ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగితేనే ఫలితాలు తథ్యమంటున్న నిపుణులు



నిజామాబాద్‌అర్బన్: పరీక్షల కాలం వచ్చేసింది. ఈ నెల 28 నుంచి ఇంటర్ పరీక్షలు, మార్చి 18 నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. దీంతో విద్యార్థులు గంటల తరబడి పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. అయితే పబ్లిక్ పరీక్షలంటే విద్యార్థుల్లో ఒక రకమైన భయం నెలకొంటుంది. ఎన్ని పరీక్షలు రాసినా ప్రతి పరీక్ష కొత్తగానే ఉంటుంది. పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడికి గురవుతూనే ఉంటారు. దీంతో చదివింది గుర్తుకు రాక, జవాబులు రాయలేక సరైన మార్కులు కోల్పోతుంటారు. ఈ సమయంలో భయాన్ని, ఒత్తిడిని అధిగమించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే వంద శాతం ఫలితాలు సాధించడం సులభమని నిపుణులు సూచిస్తున్నారు.

చదివినవి గుర్తుకు తెచ్చుకోవాలి

ఇప్పుడు విద్యార్థులకు పునశ్చరణ తరగతులు చాలా కీలకం. కొంత మంది పరీక్షలకు ముందు బాగా చదువుతారు. పరీక్ష హాల్లోకి వెళ్లగానే చదివింది మర్చిపోతుంటారు. పరీక్షలే కీలకం కావడంతో చదివినవన్నీ గుర్తుకు తెచ్చుకోవాలి. ఏది మరిచిపోయాం, ఎందుకు మర్చిపోయామో గమనించాలి. ఏ సబ్జెక్టులో ఎన్ని మార్కులు వస్తాయో ముందుగానే అంచనాకు రావాలి. ఈ మేరకు పరీక్షలకు మానసికంగా సిద్ధం కావాలి.

ఇంటర్‌లో 22,338 మంది..

జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది ఇంటర్ విద్యార్థులు 22,338 మంది, పదో తరగతి విద్యార్థులు 21795 మంది పరీక్షలు రాయనున్నారు. పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలంటే సాధన చేయాలని పలువురు నిపుణులు పేర్కొంటున్నారు.

పరీక్షలపై భయం వద్దు



విద్యార్థులు ముందుగా పరీక్షలపై భయం వీడితేనే విజయం తథ్యమని ప్రముఖ మానసిక వైద్యుడు, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ విశాల్ అన్నారు. పది, ఇంటర్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఎలా చదవాలి, పరీక్షలను ఎలా రాయాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో 'సాక్షి' ద్వారా పలు సూచనలు చేశారు.

- జీవితంలో అనుకున్నది సాధించాలంటే ముందుగా భయాన్ని వీడాలి.
- అర్థంకాని సబ్జెక్టులను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులను అడిగి తెలుసుకోవాలి.
- బద్ధకం, సోమరితనం, అతినిద్ర మన దరి చేరకుండా చూడాలి.
- ప్రతి రోజు ఉదయం అరగంట పాటు యోగా, వ్యాయామం చేయాలి.
- చదువుతున్న ప్రతి గంటలో పది నిమిషాలు విరామం తీసుకుంటే చదివిన విషయాలు జ్ఞాపకంగా ఉంటాయి.
- పరీక్ష హాలులోకి వెళ్లగానే ఇన్విజిలేటర్ ఇచ్చే ప్రశాపత్రాన్ని శ్రద్ధగా చదవాలి. ముందుగా తెలిసిన సమాధానాలు ఎలా రాయాలి. వాటికి ఎంత సమయం కేటాయించాలో తెలుసుకోవాలి.
- పరీక్షల్లో జవాబులు సొంతంగా రాయడానికి ప్రయత్నిస్తే మార్కులు అధికంగా వచ్చే అవకాశం ఉంటుంది.
- పరీక్షలో పేపరుదిద్దే ఉపాధ్యాయులకు నచ్చే విధానంలో జవాబులు ఉండాలంటే.. జవాబులను పాయింట్లు లాగా సక్రమంగా, సంపూర్ణంగా, అర్థవంతంగా రాయాలి. అనవసరమైన వ్యాఖ్యలు, పిచ్చిరాతలు లేకుండా చూడాలి. జవాబులను స్పష్టంగా రాయాలి.
- చేతి రాతను అందంగా మెరుగుపరుచుకోవాలి. అంతే కాకుండా అవసరమయినంత వేగంగా రాయడానికి ప్రయత్నించాలి. పరీక్షలో కష్టమైన ప్రశ్నలను కూడా వదలకుండా ఎంత వరకు వచ్చే అంతరాయడానికి ప్రయత్నించాలి. సమయాన్ని వృథా చేయకూడదు.

బడికి వెళ్లాలంటేనే భయం..



పాఠశాలలో ఉన్న విద్యార్థులు



పోస్టు మార్టం గది ఆనుకుని ఉన్న పాఠశాల

- పోస్టుమార్టం గది పక్కనే పాఠశాల
- క్రమంగా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- పట్టించుకోని విద్యాశాఖ

బాల్కొండ: పాఠశాల అంటే పిల్లల అరుపులు, ఉపాధ్యాయులు పాఠాలు, బడి గంటలు ఇలా చాలా ఉంటాయి. కానీ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాత్రం పరిస్థితి భిన్నం. అక్కడ బడి గంటలు మోగవు.. విద్యార్థుల కేరింతలు పెద్దగా వినబడవు.. ఒకప్పుడు అధిక సంఖ్యలో కనిపించే ఆ పాఠశాల ప్రస్తుతం విద్యార్థులు లేక వెలవెలబోతుంది. దీనికి ప్రధాన కారణం పాఠశాల పక్కనే పోస్టుమార్టం గది ఉండడంతో పాటు విపరీతమైన కంపు వాసన వస్తోంది. దీంతో విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యనభ్యసించడానికి వెనుకంజ వేస్తున్నారు.

మండల కేంద్రంలోని ఖిల్లా ప్రాంతంలో ఉన్న భవనంలో ప్రాథమికోన్నత పాఠశాల కొనసాగుతోంది. ఇందులో ఏడు తరగతి వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గతేడాది ఈ భవనాన్ని మైనార్టీ గురుకుల పాఠశాలకు గత ప్రభుత్వం కేటాయించింది. దీంతో మహిళా సమాఖ్య భవనాన్ని ప్రాథమికోన్నత పాఠశాలకు కేటాయించింది. ఈ స్కూల్ పక్కనే పోస్టుమార్టం గది ఉండడంతో విపరీతమైన కంపు కొడుతోంది. పాఠశాల భవనం వైపే కిటికీలు ఉండడంతో మృతదేహాలను పోస్టుమార్టానికి తీసుకువచ్చినప్పుడు విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు.

విద్యార్థుల అనాసక్తి..


ఈ పాఠశాలలో ఏడో తరగతి వరకు విద్యనభ్యసించేందుకు అవకాశం ఉన్నా ఆరుగురు విద్యార్థులు మాత్రమే చదువుతున్నారు. ఈ పాఠశాలలో చదివేందుకు ఎక్కువగా పాత జాతీయ రహదారి అవతలి వైపు నుంచి ఎక్కువగా వచ్చేవారు. కాని పోస్టుమార్టం గదికి ఆనుకుని ఉండడంతో గతంలో 36 మంది ఉన్న విద్యార్థుల సంఖ్య క్రమంగా 6కు చేరింది. ఒకే టీచర్‌తో విద్య అభ్యాసన కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 200 మీటర్ల దూరంలోనే ఈ ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. దీంతో ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ పాఠశాలను కలపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ప్రాథమికోన్నత పాఠశాల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈ పాఠశాలను సమీప పాఠశాలలో కలిపే యోచనలో ఉన్నట్లు తెలిసింది. త్వరలో నిర్ణయం జరుగుతుంది.

– రాజేశ్వర్, ఎంఈవో, బాల్కొండ

కొంగలు వాలే చెట్టయ్యింది



అప్పటి వరకు చేపలను వేటాడిన కొంగలు ఓ మోడుబారిన చెట్టు కొమ్మలపై గుంపుగా వాలి సేద తీరాయి. ఫారెస్టు పార్కులో ఏర్పాటు చేసినట్లుగా కనిపిస్తున్న ఈ సహజసిద్ధమైన చిత్రం డొంకేశ్వర్ మండలం మారంపల్లి చెరువు వద్ద 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– డొంకేశ్వర్

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తాడ్వాయి: మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1997–98 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు అరవింద్, స్వామిగౌడ్, రామరాజు, మహేశ్, శ్రీనివాస్, సాయిలుపాల్గొన్నారు.

మోర్తాడ్‌లో..

మోర్తాడ్: మండలంలోని పాలెం ఉన్నత పాఠశాలలో 1998–99 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత విద్యార్థులందరూ ఒకేచోట కలవడంతో సంతోషం వ్యక్తం చేశారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.



మోర్తాడ్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సెల్‌ఫోన్ చోరీ చేస్తూ పట్టుబడ్డ బాలుడు

భిక్కనూరు: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన అంగడిలో సెల్‌ఫోన్ చోరీ చేస్తూ ఓ బాలుడు పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి అంగడిలో కూరగాయలు కొనుగోలు చేస్తుండగా 13 ఏళ్లు ఉన్న బాలుడు సదరు వ్యక్తి జేబు నుంచి సెల్‌ఫోన్‌ను దొంగిలిస్తుండగా పట్టుకున్నాడు. దీంతో బాలుడిని పోలీసులకు అప్పగించారు. పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలించగా రెండు వారాల క్రితం ఇదే బాలుడు అంగడిలో తిరిగినట్టు పోలీసులు గుర్తించారు. సదరు బాలుడు తన పేరు రవితేజ అని తన ప్రాంతం ఒరిస్సా అని ఒక్క సారి విజయవాడ అని మరోసారి చెబుతున్నట్లు పోలీసులు తెలిపారు. విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

రైలు కింద పడి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్‌వాయి సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం 8 గంటల ప్రాంతంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు కామారెడ్డి రైల్వే ఎస్సై తావూనాయక్ తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతుడి వయస్సు 40 ఏళ్ల వరకు ఉంటుందన్నారు. ఎవరికైనా మృతుడి ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని కోరారు.

పోలీసుల అదుపులో బైక్ చోరీ ముఠా..?

కామారెడ్డి క్రైం: ఉమ్మడి జిల్లా పరిధిలో బైక్ చోరీలకు పాల్పడుతున్న ఓ ముఠాను కామారెడ్డి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఇటీవల చోరీకి గురైన వాహనాల విషయంలో ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పలు కేసులు నమోదై ఉన్నాయి. జిల్లా కేంద్రానికి చెందిన ఓ బైక్ చోరీ కేసును విచారిస్తున్న పోలీసులు నిందితులను నిజామాబాద్ ప్రాంతానికి చెందిన పాత నేరస్తులుగా గుర్తించినట్లు తెలిసింది. ఈ మేరకు వారిని పట్టుకుని విచారిస్తున్నారని సమాచారం. కేసులో దాదాపు 15 నుంచి 20 చోరీకి గురైన బైకులను రికవరీ చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

ఆలయంలో హుండీ చోరీ

రుద్రూర్: కోటగిరి మండలంలోని పోచారం కాలనీలో ఉన్న బసవేశ్వర ఆలయ హుండీని గుర్తు తెలియని దుండగులు శనివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. కాలనీలో ఈ ఆలయాన్ని నూతనంగా నిర్మించారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్సారెస్పీలో మత్స్యకారుడు గల్లంతు



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లిన ఒకరు గల్లంతైనట్లు ఎస్సై భాస్కరాచారి ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన అనికేశ్వర్ రమేశ్(46) చేపల వేటతో జీవనోపాధి పొందుతున్నాడు. ఉదయం ము ప్కాల్ శివారులోని ప్రాజెక్టులో తెప్పపై చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశత్తు వల కాళ్లకు చు ట్టుకోవడంతో నీట మునిగాడు. తోటి మత్స్యకారులు తీరం చేరుకున్నా రమేశ్ రాక పోవడంతో నీటిలో గల్లంతైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు, మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి కావడంతో గాలింపు చర్యలను నిలిపి వేశారు. సోమవారం ఉదయం మళ్లీ గాలింపు చర్యలు చేపడతామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాష్ట్ర సాఫ్ట్ బాల్ పోటీల్లో జిల్లా జట్టు చాంపియన్



చాంపియన్‌గా నిలిచిన జిల్లా జట్టు క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఈ నెల 3, 4వ తేదీల్లో మెదక్‌లో నిర్వహించిన రాష్ట్ర జూనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో జిల్లా జట్టు సెమీఫైనల్‌లో సిద్దిపేట్ జట్టుపై విజయం సాధించగా ఫైనల్‌క చేరుకుంది. ఫైనల్‌లో ఆదిలాబాద్ జిల్లా జట్టుపై 7–0 తేడాతో గెలుపొంది టోర్నమెంట్ చాంపియన్‌గా నిలిచింది. రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ చేతులమీదుగా ట్రోఫీని అందుకున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగామోహన్ తెలిపారు. పతకాలు అందుకున్న క్రీడాకారులను, జట్టుకు కోచ్ మేనేజర్‌గా వ్యవహరించిన నరేశ్, సెంథిల్ సుజాతను అభినందించారు. జిల్లా జట్టు చాంపియన్‌గా నిలవడంపై రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, ఉపాధ్యక్షులు శోభన్ బాబు, అభిషేక్ గౌడ్, ఇండియా కోచ్ కృష్ణ, జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ బద్దం లింగారెడ్డి, సంగీతరావు, నీరజారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, మల్లేశ్ గౌడ్, మర్కంటి సుజాత, చిప్ప నవీన్, సొప్పరి వినోద్ హర్షం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి



రవి(ఫైల్)

కామారెడ్డి క్రైం: గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని భరత్‌నగర్ కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. కాలనీకి చెందిన చింతల రవి (45) ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. శనివారం రాత్రి గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందులు, అప్పుల కారణంగా ఎంతో బాధపడేవాడని అతని బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

ప్రమాదవశాత్తు జాలరి..

నవీపేట: మండలంలోని పాల్దా శివారులో ఉన్న వాగులో అదే గ్రామానికి చెందిన జాలరి మెట్‌పల్లి చిన్న బాబన్న(48) ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ ఆదివారం తెలిపారు. చేపల కోసం వాగులోకి దిగిన బాబన్న కాళ్లకు నాచు చుట్టుకోవడంతో నీటిలో పడి మృతిచెందాడన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అనారోగ్యంతో బీఆర్ఎస్ నాయకుడు..



గంగాధర్ (ఫైల్)

మోర్తాడ్: ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ లావణ్య భర్త గుల్లె గంగాధర్(63) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న అతను కొన్ని రోజులుగా ముంబైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అక్కడే చికిత్స పొందుతూ ఉదయం మృతిచెందాడు. స్వగ్రామానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు. గంగాధర్ మృతిపై గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

వాహనాల తనిఖీ



బాల్కొండ: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టినట్లు ఏఎస్సై శంకర్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వాహన ధ్రువీకరణపత్రాలు లేని వారికి జరిమానా విధించారు. ఇందులో రెండు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, 10 పెండింగ్ జరిమానాలను వసూలు చేసినట్లు చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

బాల్కొండ: మండల కేంద్రంలోని వన్నెల్(బి) సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై గోపి ఆదివారం తెలిపారు. ఈ దాడిలో 8 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 16,900 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా పేకాట, మట్కా ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

■ ఒకరి మృతి మరొకరికి తీవ్రగాయాలు



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి శివారులో బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలైనట్లు ఎస్‌హెచ్‌వో రవికుమార్ ఆదివారం పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. జక్రాన్‌పల్లి నుంచి ఆర్మూర్ వైపు బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులను వెనుక నుంచి వచ్చిన ఓ లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న తొర్లికొండ గ్రామానికి చెందిన మహివర్ధన్‌గౌడ్(17) అక్కడికక్కడే మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బోధన్‌టౌన్: పట్టణంలోని సాత్‌పూల్ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైనట్లు సీఐ వీరయ్య తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. రాకాసీపేట్ కాలనీకి చెందిన ఇఫ్తేకార్ అహ్మద్ శక్కర్‌నగర్ నుంచి రాకాసీపేట్‌కు ఆదివారం బైక్‌పై వస్తుండగా, పట్టణానికి చెందిన సాయి ప్రీతమ్ అంబేడ్కర్ చౌరస్తా నుంచి నిజామాబాద్ రూట్‌లో వెళ్తుండగా బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.